సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 8 । జూలై । 2023



గోశాలలకు కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 20 కోడెలను లింగాలఘన్‌పూర్ మండలం నెల్లుట్ల బహుజన గోసంరక్షణ గోశాలకు శుక్రవారం అందజేశారు.



డ్రైవర్లకు శిక్షణ తరగతులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం బీఎస్‌–6 వాహనాలపై డ్రైవర్లకు శిక్షణనిచ్చారు. అధికారులు సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్ పలు సూచనలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

‘బడుగు’ వీరులు ఎవరో?

- తొలుత బీసీలకే టికెట్లని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటన
- పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు అవకాశం
- గంపెడాశలతో ఉమ్మడి జిల్లాలో ఆశావహులు
- ఎవరిని ప్రకటిస్తారోనని ఉత్కంఠ
- ఆసక్తికరంగా రాజకీయాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడ్డ అంశాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే టికెట్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం కర్ణాటక మాదిరిగా బీసీ ఫార్ములాను అనుసరించాలని నిర్ణయించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల టికెట్లే ప్రకటిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో ఉత్కంఠ నెలకొంది. కర్ణాటకలో అనుసరించిన విధంగానే ప్రతీ పార్లమెంటు సెగ్మెంటుకు ఇద్దరు బీసీలకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం యోచిస్తోంది. పాత జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి తోపాటు నిజామాబాద్ పార్లమెంటు (జగిత్యాల, కోరుట్ల) సెగ్మెంట్లు వస్తాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో మొత్తంగా చూస్తే కేవలం ఐదుగురికి మాత్రమే చోటు దక్కేలా ఉంది. వీరిలో ఎవరిని టీపీసీసీ కరుణిస్తుందో అన్న చర్చ మొదలైంది.



వేములవాడ: ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్ పార్లమెంటు బీసీ సామాజిక వర్గం కోటాలో టికెట్ ఆశిస్తున్నవారిలో ముందువరుసలో ఆది శ్రీనివాస్ ఉంటారు. మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ వేములవాడ నుంచి గత 2009, 2010, 2014, 2018 నాలుగు పర్యాయాలు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇందులో సార్వత్రిక ఎన్నికలు కాగా ఒక ఉప ఎన్నిక ఉంది. ప్రతీసారి విజయం కోసం వీరోచితంగా పోరాడుతున్న ఆది శ్రీనివాస్ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న కసితో ఉన్నారు. సుదీర్ఘకాలంగా పోటీ చేస్తుండటం, ప్రజల్లో సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న కొత్త ఊపు తనకు కలిసి వస్తుందని ధీమాగా ఉన్నారు.

కరీంనగర్: పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో పొన్నం ప్రభాకర్ కూడా ఒకరు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నుంచి ఇద్దరు బీసీలకు టికెట్లు ఇవ్వాల్సి వస్తే.. అందులో పొన్నం ప్రభాకర్ కూడా ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. బీసీల్లో బలమైన గౌడ సామాజిక వర్గానికి చెంది ఉండటం, గతంలో ఎంపీ, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేసి ఉండటం, పార్టీలోనూ పలు కీలక పదవులు నిర్వహించిన అనుభవం ప్రభాకర్ సొంతం. కరీంనగర్ అసెంబ్లీ నుంచి పలువురు వ్యాపారవేత్తలు టికెట్లు అడుగుతున్న క్రమంలో ఆయన ఎంపీగా కాంటెస్ట్ చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు.

పెద్దపల్లి: గంటా రాములు యాదవ్

పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో బీసీ కోటాలో టికెట్ ఆశిస్తున్న మరో నాయకుడు గంటా రాములు యాదవ్. టీడీపీ నేతగా ఉమ్మడి జిల్లాలో తనకంటూ గుర్తింపు సాధించుకున్నారు. 22 ఏళ్లగా ప్రతీసారి ప్రతిపక్ష పార్టీలో ఉంటూ స్థానిక సంస్థల నుంచి విజయాలు సాధిస్తూ వస్తున్న రికార్డు ఆయన సొంతం. తెలుగుదేశం నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములు.. ఈసారి ఎలాగైనా ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన నేత కావడం, పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటాలో తనకు అవకాశం దక్కుతుందని పేర్కొంటున్నారు.

రామగుండం: మక్కాన్‌సింగ్ ఠాకూర్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ది ప్రత్యేక స్థానం. 2004 నుంచి 2009 వరకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితుడిగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) చైర్మన్‌గా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ రెబెల్‌గా, 2018 కాంగ్రెస్ అభ్యర్థిగా రామగుండం ఎమ్మెల్యే సీటు కోసం పోటీచేశారు. తాజాగా మరోసారి కూడా ఆయన ఇక్కడ నుంచే పోటీకి సిద్ధపడ్డారు. పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటా అమలు, పార్టీలో సీనియర్ నాయకుడిగా అనుభవం, రామగుండం స్థానికుడు కావడంతో తనకు టికెట్ గ్యారెంటీ అన్న ధీమాలో ఉన్నారు.

కోరుట్ల: కొమొరెడ్డి కరమ్‌చంద్

తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు కుమారుడు కొమొరెడ్డి కరమ్. ఈయన తనకు కోరుట్ల టికెట్ కావాలని కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. పార్టీకి తన తండ్రి చేసిన సేవలు, నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వాల్సి రావడం తనకు కలిసి వస్తాయని ఆశాభావంతో ఉన్నారు. బీసీల్లో బలమైన సామాజికవర్గం అయిన మున్నూరు కాపు కావడం తనకు అదనపుబలంగా భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

పోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తులకు డిమాండ్



ముస్తాబాద్(సిరిసిల్ల): పోషక విలువలు అందించే పోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని నాబార్డు ఏజీఎం మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. పోతుగల్ సింగిల్‌విండో కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. పోతుగల్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో పోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ ఫ్యాక్టరీని త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైస్‌మిల్లుల్లో వచ్చే బియ్యానికి ఒక్క శాతం పోర్టిఫైడ్ బియ్యాన్ని కలపాల్సి ఉంటుందన్నారు. గూడెంలోని గోదాం, కమర్షియల్ కాంప్లెక్స్ పరిశీలించారు. ఏఎం సల్మాన్‌ఖాన్, సీఈవో కృష్ణ, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



బోయినపల్లి(చొప్పదండి)/కోనరావుపేట(వేములవాడ): ఎరువులు, విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనాలని డీఏవో భాస్కర్ సూచించారు. బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, మామిడిపల్లి, కొండాపూర్, నిమ్మపల్లి, సుద్దాల గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం డీఏవో తనిఖీలు చేపట్టారు. భాస్కర్ మాట్లాడుతూ ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేయాలని తెలిపారు. మందులు, ఎరువులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. ఏవోలు వెంకట్రామమ్మ, ప్రణీత ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం మాదిగ దండోరా 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాలను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమం అంతిమదశకు చేరిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. శ్రీనివాస్, గోపాల్, దేవయ్య, ఎల్లయ్య, రాజయ్య, నర్సయ్య, సతీశ్, రాజు పాల్గొన్నారు.

10న పాలిసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

వేములవాడఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 10న చివరి విడత సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు అగ్రహారం ఎస్సారార్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు. మొదటి విడతలో సీటు రానివారు, వచ్చినా చేరనివారు, మరో మంచి కళాశాలలోని కోర్సుకు మారదల్చుకునే వారు చివరి విడతలో ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు. ఈనెల 8 నుంచి 9 వరకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని, 10న సర్టిఫికెట్ల పరిశీలనకు అగ్రహారం కాలేజీలో హాజరుకావాలని సూచించారు. 11న ఆప్షన్స్ ఫ్రీజింగ్, 14న సీట్ల కేటాయింపు, 14 నుంచి 16 వరకు వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ రిపోర్టింగ్, 17వ తేదీ వరకు సీటు వచ్చిన కళాశాలలో చేరాల్సి ఉంటుందని వివరించారు.

11న ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈనెల 11న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో డీఎస్.వెంకన్న ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ పొందాలంటే విద్యార్థులు టీసీ, స్టడీ, కులం, ఆదాయం, నివాసం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు నాలుగు, ఒరిజినల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 83339 25362, 94404 80175లో సంప్రదించాలని కోరారు.

వేములవాడ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- మత్తడి పోచమ్మకు మొక్కులు
- కలెక్టరేట్‌లో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ/సిరిసిల్ల/వేములవాడఅర్బన్: వేములవాడ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడ పట్టణం, ఆలయాల అభివృద్ధి ఏకకాలంలో జరిగేందుకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గుడిచెరువు మత్తడి పోచమ్మకు శుక్రవారం మున్నూరుకాపులు నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొని మాట్లాడారు. రాజన్న గుడికి 35 ఎకరాలు, బద్దిపోచమ్మ గుడికి 39 గుంటల స్థలాన్ని సేకరించగలిగామన్నారు. తనకు ఆర్భాటాలు, హంగులు చేయడం రాదని, వేములవాడను కన్నతల్లిలా భావించి అభివృద్ధి చేస్తున్నానన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

వేములవాడలో ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాల కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ, డ్రెయినేజీల నిర్మాణాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రగతిపై సమీక్షించారు. వచ్చే వారం మంత్రి కేటీఆర్ వేములవాడకు రానున్న నేపథ్యంలో ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రుద్రంగిలోని కేజీబీవీకి సిమెంట్ రోడ్డు, నాంపల్లి గుట్టపై కోనేరు నిర్మాణం, అభివృద్ధి పనులపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో పవన్‌కుమార్, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జిల్లా గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ శాంతయ్య, కౌన్సిలర్లు అజయ్, యాచమనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెస్ కార్యాలయం ప్రారంభం

వేములవాడ నందికమాన్ వద్ద మారుపాక రోడ్డులో వేములవాడ అర్బన్ మండల నూతన సెస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ వస్తే ఏం వచ్చిందో మిడ్‌మానేరులోని 25 టీఎంసీల నీటిని చూస్తే అర్థమవుతుందన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్లు హరిచరణ్‌రావు, దేవరకొండ తిరుపతి, దేవరాజం, ఎండీ రామకృష్ణ, ఎంపీపీ వజ్రమ్మ, జెడ్పీటీసీ రవి తదితరులు ఉన్నారు.

పట్టుకున్నారు..వదిలేశారు

- 17 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు
- తహసీల్దార్ లేఖతో వదిలిన వైనం



పోలీసులు పట్టుకున్న ఇసుక వాహనాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో శుక్రవారం ఇసుక రవాణా చేస్తున్న 17 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న సంఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. వెంకటాపూర్ శివారులోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ప్రేమ్‌దీప్ సిబ్బందితో వెళ్లి వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమకు అనుమతులున్నాయని వాహనదారులు చెప్పగా.. వాటిని పరిశీలించగా ఈనెల 4న ఇసుక రావాణాకు అనుమతులు ఇచ్చినట్లు ఉండడంతో ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసులు పెట్టేందుకు ఎస్సై ఉపక్రమించారు. భయాందోళన చెందిన ఇసుక రవాణాదారులు వెంటనే తహసీల్దార్ జయంత్‌కుమార్ వద్దకు వెళ్లి 4వ తేదీ నాడు వర్షం పడడంతో ఇసుక రవాణా చేయలేదని చెప్పారు. అయితే పాత అనుమతిపత్రాలపైనే తేదీని మార్చిన విషయాన్ని పోలీసులకు తెలపకపోవడంతో పోలీసులు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై శుక్రవారం ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని రవాణాదారులు కోరగా, తహసీల్దార్ అనుమతి పత్రాలపై తమ సిబ్బంది తేదీని మార్చినట్లు తెలుపుతూ పోలీసులకు లేఖ రాయడంతో పట్టుకున్న వాహనాలను ఎస్సై వదిలివేశారు.

పోడు పట్టాలివ్వలేదని గిరిజనుల ఆగ్రహం

- అడవిని నరుకుతున్న గిరిజనులు
- అడ్డుకున్న పోలీసులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): దరఖాస్తులు చేసుకున్నా తమకు పోడుభూములపై పట్టాలు ఇవ్వలేదన్న ఆగ్రహంతో నిమ్మపల్లిలో గిరిజనులు అటవీ ప్రాంతాన్ని నరికేశారు. నిమ్మపల్లిలో పోడుపట్టాల కోసం మొత్తం వంద మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. గురువారం వీరిలో 66 మందికి మాత్రమే మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పట్టాలు అందజేశారు. అర్హత ఉన్నా పట్టాలివ్వలేదన్న ఆగ్రహంతో గ్రామానికి చెందిన మిగతా 29 మంది గిరిజనులు, మరికొందరు బీసీలు నిమ్మపల్లి శివారులోని అందులగుట్ట ప్రాంతంలో గతంలో అటవీ అధికారులు ప్లాంటేషన్ చేసిన స్థలంలో మొక్కలను, చెట్లను శుక్రవారం నరికివేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్, ఎఫ్ఆర్వో ఖలీలొద్దీన్, సెక్షన్ అధికారి శ్రీనివాస్ అక్కడికి చేరుకుని గిరిజనులను, బీసీలను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తమకు కూడా పట్టాలివ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. బీట్ అధికారి అభిషేక్‌రావు తదితరులు ఉన్నారు.

ఆత్మీయతతో వైద్యం అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- హెల్త్ సూపర్‌వైజర్లకు పీఆర్వోలుగా బాధ్యతలు
- మెటర్నిటీ సర్వీసు ఎగ్జిక్యూటీవ్‌ల నియామకం



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఆత్మీయతతో వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఆస్పత్రి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 62 శాతం ఉన్న ప్రసవాల సంఖ్యను 80 శాతానికి పెంచాలని సూచించారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో 8 మందిని, వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో ఐదుగురు హెల్త్ సూపర్‌వైజర్లను పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు(పీఆర్వోలు)గా నియమిస్తున్నట్లు తెలిపారు. వీరిని మెటర్నిటీ సర్వీస్ ఎగ్జిక్యూటీవ్‌గా పిలుస్తారని, మూడు షిఫ్టుల్లో ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆస్పత్రికొచ్చే గర్భిణులకు అన్ని రకాల వైద్యసేవలు దగ్గరుండి అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. వారం పాటు ట్రయల్‌రన్ నిర్వహించి, లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, మెటర్నిటీ ప్రోగ్రాం అధికారి మహేశ్, ఆర్ఎంవో సంతోష్, వేములవాడ ఆస్పత్రి పర్యవేక్షకులు ఆర్.మహేశ్‌రావు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని, జీవో 58, 59, 76, 118 కింద భూక్రమబద్ధీకరణ సమస్యలను పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

టేలా తొలగింపు



టేలను తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ: పట్టణంలోని పెద్దమ్మ చౌక్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఏర్పాటు చేసుకున్న టేలను మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్ అంటూ ఈనెల 7న సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి టేలాను తొలగించారు. దీంతో రోడ్డు శుభ్రంగా కనిపిస్తుందని లాలపల్లి వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

10 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న డీఈవో

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులు ఈనెల 10 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు జిల్లా విద్యాధికారి అన్ని పాఠశాలల హెచ్ఎంకు అధికారికంగా ఉత్తర్వుల్లో తెలిపారు. మధ్యాహ్న భోజనం అమలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఈవో ఆదేశాలతో మధ్యాహ్న భోజనాన్ని ఎలా ఏర్పాటు చేయాలని తలలు పట్టుకుంటున్నారు. కార్మికులకు రావాల్సిన బిల్లులు, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన గౌరవ వేతనం అందించాలని కోరుతున్నారు. విద్యాసంవత్సరానికి ముందుగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజనానికి అవసరమైన సరుకులను టెండర్ విధానంలో సరఫరా చేయాలని అదే అందరికీ శ్రేయస్కరమని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పార్టీ పరువు కాపాడుకునేందుకే ప్రధాని పర్యటన



వేములవాడలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

వేములవాడ: రాష్ట్రంలో బీజేపీ పరువు కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్రమోదీ పర్యటన చేపట్టారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. 2017లోనే సీఎం కేసీఆర్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కు పనులు ప్రారంభించారని, మళ్లీ అవే పనులను ప్రధాని ప్రారంభిస్తారా? అని ప్రశ్నించారు. వేములవాడలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నివాసంలో శుక్రవారం మాట్లాడారు. రైల్వేకోచ్ ఫ్యాక్టరీనా..? వ్యాగన్ వాషింగ్ ఫ్యాక్టరీనా ? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాని మోదీ స్పష్టతనివ్వాలని కోరారు. సిరిసిల్లకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోని కేంద్రం ఇప్పుడు ప్రారంభించిన చోటనే మళ్లీ ఎందుకు ప్రారంభిస్తున్నారని నిలదీశారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హామీలు ఇవ్వడం తప్ప రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మరోసారి కొట్లాడితేనే కొలువులు సాధించుకుంటామన్నారు. అనంతరం రాహుల్‌గాంధీ స్టే కోసం వేసిన పిటిషన్‌ను గుజరాత్ కోర్టు తిరస్కరించడాన్ని నిరసిస్తూ వేములవాడ మూలవాగు బ్రిడ్జి వద్ద బైఠాయించారు.

గంజాయి మత్తులో యువత

- గుట్టుగా గంజాయి సేవిస్తున్న యువకులు
- గ్రామ శివారులే అడ్డాలు



చందుర్తి శివారులో రాత్రిపూట గంజాయి సేవిస్తున్న యువకుడు

చందుర్తి(వేములవాడ): గంజాయి మత్తులో యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. గ్రామ శివారులోని పంటపొలాలే అడ్డాలుగా చేసుకుంటున్నారు. రాత్రి పూట శివారు ప్రాంతాల్లోని పొలాల వద్దకు వెళ్లి గంజాయి సేవిస్తున్న వీడియో ‘సాక్షి’కి చిక్కింది. చందుర్తిలోని కొందరు యువకులు నిత్యం రాత్రిపూట పంటపొలాల వద్దకు వెళ్లే దారులను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. గంజాయిని సిగరేట్లలో నింపుకొని దమ్ముకొడుతున్నట్లు వీడియోలో స్పష్టంగా తెలుస్తోంది. మండలంలోని మల్యాల, లింగంపేట, రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల్లోని చాలా మంది యువకులు గంజాయికి అలవాటుపడి చీకటిపడితే పంటపొలాల వద్దకు వెళ్లి గంజాయి సేవించి రాత్రి పొద్దుపోయాక ఇంటికి చేరుతున్నారన్న ప్రచారంలో ఉంది. ఏదిఏమైనా పోలీసులు నిఘా తీవ్రతరం చేసి గంజాయిని కట్టడి చేయకపోతే యువకుల విలువైన జీవితాలు నాశనం కానున్నాయి.

క్లుప్తంగా

రుద్రంగి సినిమా సందడి



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని విమల్ థియేటర్‌లో రుద్రంగి సినిమాను జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా థియేటర్‌లో కేక్ కట్ చేసిన తర్వాత సినిమాను వీక్షించారు. ఇల్లంతకుంట మార్కెట్ చైర్మన్ మామిడి సంజీవ్, నాయకులు పల్లె నర్సింహరెడ్డి, గొడుగు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చిరిగిన నోటు



ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఇండిక్యాష్ ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేయగా చిరిగిన నోటు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన ఏనుగుల పర్శరాములు శుక్రవారం ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేయగా అందులో రూ.500 నోటు సగం వరకు చిరిగిపోయి వచ్చిందని, ఏటీఎంలో నోట్లు ఇలా వస్తే ఎలా ప్రశ్నించాడు. చిరిగిన నోటును ఎవరికి అప్పగించాలో తెలియడం లేదని, ఏటీఎంలో ఇలా చిరిగిన నోట్లు పెట్టి ప్రజలను మోసం చేయవద్దని బాధితుడు కోరుతున్నాడు.

పేద విద్యార్థులకు చేయూత



సిరిసిల్లకల్చరల్: యోగ సాధనలో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న గీతానగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల నిధినుంచి ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం పాఠశాలలో రీడింగ్ క్యాంపెయిన్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య పఠనం విద్యార్థుల సామాజిక, శాస్త్రీయ వికాసానికి దోహదం చేస్తుందన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థిని రుచితకు ఉన్నత చదువుల కోసం రూ. 4వేలు అందజేశారు. రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఈ.సంజయ్ సోదరులకు రూ. 2వేలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ రుద్రవీణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మీసం లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ బిల్లులు, కనీస వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతినెలా 5లోపు బిల్లులు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుంటివేణు, పంతం రవి, తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న పల్లెలు

- నిరవధిక సమ్మెలో పంచాయతీ కార్మికులు
- నిలిచిపోయిన చెత్త సేకరణ
- మురుగు కాలువలతో దుర్గంధం
- జిల్లాలో 2,450 మంది కార్మికులు



ఎల్లారెడ్డిపేటలో సమ్మె చేస్తున్న కార్మికులు



ఇళ్ల ముందు పేరుకుపోయిన చెత్త

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెతో పల్లెల్లో చెత్త, మురుగుకాలువలు నిండిపోయి కంపుకొడుతున్నాయి. మూడ్రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఎటుచూసినా రోడ్లవెంట, వీధులు దుర్గంధం వెదజల్లుతున్నాయి. అసలే వానాకాలం కావడంతో ప్రజలు రోగాలబారినపడే అవకాశాలున్నాయి. పల్లెలను నిత్యం శుభ్రంచేసే కార్మికులు సమ్మెబాట పట్టడంతో ప్రజలు చెత్తతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలుండగా 1223 మంది పారిశుధ్య కార్మికులు, పంపు ఆపరేటర్లు, చెత్త సేకరించే ట్రాక్టర్ల డ్రైవర్లు, నీటి నిర్వహణ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. 434 మంది మల్టీపర్పస్, 793 మంది అనధికారిక మల్టీపర్పస్ కార్మికులు గా ఉన్నారు. వీరంతా ఒకేసారి సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో చెత్తను సేకరించే వారు కరువయ్యా రు. దీనికి తోడు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు, వృక్షాలకు నిత్యం నీరు పట్టేవారు కరువయ్యారు. ఫలితంగా అవి ఎండిపోతున్నాయి.

ఎక్కడచూసినా చెత్తే..

పట్టణాలు, గ్రామాలు, తండాల్లో ఎక్కడచూసినా చెత్త కంపు కొడుతోంది. మురుగు కాలువలు, చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. కార్మికులు సమ్మెకు దిగడంతో పంచాయతీ పాలకవర్గాలు, సంబంధిత అధికారులు చేతులెత్తేశారు. దీంతో గ్రామాల్లో పరిశుభ్రత లోపించి ఏ గ్రామానికి వెళ్లినా పేరుకుపోయిన చెత్త, నిండిపోయిన మురుగుకాలువలు దర్శనమిస్తున్నాయి.

డిమాండ్లు ఇవే..

- కనీస వేతనం రూ.19,వేలతో పాటు కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- జీవో నెంబర్ 51ని సవరించాలి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.
- కారోబార్లను కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి.
- గ్రామ పంచాయతీ ఇచ్చే నిధులనుంచి కాకుండా, ప్రత్యేక గ్రాంట్ నుంచి వేతనాలు చెల్లించాలి.
- రూ.10 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందించాలి.
- సంవత్సరానికి మూడు జతల యూనిఫామ్, సామగ్రిని నగదు రూపంలో సమకూర్చాలి.
- విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.10 లక్షల బీమా, పోస్టాఫీస్ బీమా అమలుచేయాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాదబీమా గ్రాట్యూటీ గుర్తింపుకార్డులు ఇవ్వాలి.
- ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలి, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికుడి దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలి.

దుర్వాసన వస్తోంది



మూడ్రోజులుగా చెత్తను ఇళ్లనుంచి సేకరించడం లేదు. ఇంట్లో ఉన్న చెత్తనుంచి దుర్వాసన వస్తోంది. చెత్తను ఎక్కడవేయాలో అర్థం కావడం లేదు. మహిళలు చెత్తను తీసుకొని ఊరి బయటకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది.

– కుర్ర బాలమణి, గృహిణి, ఎల్లారెడ్డిపేట

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుంది. గతంలో సమ్మెచేసినా న్యాయం జరగలేదు. అందుకే తిరిగి సమ్మెకు దిగాం. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– రేసు కిషన్, ట్రాక్టర్ డ్రైవర్, ఎల్లారెడ్డిపేట

తాత్కాలిక కార్మికులను నియమిస్తాం



గ్రామాల్లో చెత్తను సేకరించడానికి తాత్కాలిక కార్మికులను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మురుగు కాలువలు శుభ్రంచేయడం, చెత్తను సేకరించడానికి తగిన చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఆందోళన చెందవద్దు

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

సమయపాలన తప్పనిసరి

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు శుక్రవారం తెలిపారు. వైద్యుల సమయపాలన, ఆస్పత్రిలో వివిధ సమస్యలు వివరిస్తూ ×సమయానికి రారేమి?¬ శీర్షికతో ×సాక్షి¬లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సూపరింటెండెంట్ స్పందించారు. ఆస్పత్రిలోని ప్రొఫెసర్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, మిగిలిన అన్ని విభాగాలకు చెందిన వైద్యులను బయోమెట్రిక్ పద్ధతి ద్వారా హాజరు పరిశీలిస్తున్నామన్నారు. ఇకపై అందరూ సకాలంలో హాజరయ్యేలా చూస్తామని వివరించారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి



దేవయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఆటో కార్మికుడు గుండెపోటుతో ఆటోలోనే మృతిచెందిన సంఘటన విషాదం నింపింది. మండల కేంద్రానికి చెందిన కోనేటి దేవయ్య (50) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తన ట్రాలీ ఆటోలో సిమెంట్ బ్యాగులు వేసుకొని ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో దించి ఎల్లారెడ్డిపేటకు తిరిగి వస్తుండగా తీవ్రమైన గుండెనొప్పి వచ్చింది. ఆటోలోనే కుప్పకూలిన దేవయ్యను తోటికార్మికులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు సాయి, కూతురు స్రవంతి ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, ఆటోకార్మికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిజామాబాద్‌లో నిర్వహించిన డ్రై డే పనులను పర్యవేక్షించారు. సీఈవో మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతుందని.. పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రాజు, ఏపీవో శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మేర్గు లక్ష్మణ్ ఉన్నారు.

చందుర్తి(వేములవాడ): చందుర్తిలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. గ్రామంలోని వీధులు, ఇళ్లలోని నీటి తొట్టెల్లోని నిల్వ చేసిన నీటిని వైద్యసిబ్బంది పారబోశారు. పాత్రలను శుభ్రం చేసి ఆరబెడితే బ్యాక్టీరియా చనిపోతుందన్నారు. శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. ప్రత్యేకాధికారి యోగేశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్‌ఎం రమాదేవి, ఆశ కార్యకర్తలు లత, లక్ష్మి ఉన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌తో ఆర్థికాభివృద్ధి

- నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏజీఎం మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్వశక్తి సంఘాల మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఫ్యాషన్ డిజైనింగ్‌లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.మనోహర్ రెడ్డి సూచించారు. రాజన్నపేటలో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్ డెమో యూనిట్లను పరిశీలించారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్కూలు యూనిఫాంలతోపాటు రాజన్నపేట బ్రాండ్‌తో వస్తువులను తయారు చేసి మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదగాలని కోరారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఆసక్తి ఉన్న మహిళలకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో రూ.750 గౌరవ వేతనం, ఉచిత భోజనం అందిస్తామన్నారు. శిక్షణ మాస్టర్ మనీషా అధునాతన మోడల్స్ గురించి మహిళలకు వివరించారు. నాబార్డ్ ఆర్వో నుంచి అసిస్టెంట్ మేనేజర్ సల్మాన్‌ఖాన్, సర్పంచ్ ముక్క శంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

దేశం విడిచిపోతున్న యువకుడి అరెస్టు

- పెండింగ్ వారెంట్ ఉండడంతో వెంబడించిన చందుర్తి ఎస్సై
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద అదుపులోకి తీసుకున్న వైనం

చందుర్తి(వేములవాడ): అరెస్ట్ వారెంట్ పెండింగ్‌లో ఉన్నా దేశం విడిచి పోతున్న యువకుడిని చందుర్తి ఎస్సై రమేశ్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు. వేములవాడలోని సాయినగర్‌లో నివసించే అడ్డగట్ల మనోజ్ (38) చందుర్తి మండలం కట్టలింగంపేటలో 2015లో ఓ యువతి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో పెండింగ్ అరెస్టు వారెంట్ ఉంది. అయినప్పటికీ గురువారం రాత్రి దేశం విడిచిపెట్టి యూరప్ దేశానికి వెళ్తున్నాడని తెలుసుకొని కాల్‌డాటా, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెంబడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. పెండింగ్ వారెంట్‌లో అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు పంపించినట్లు ఎస్సై వివరించారు.

రైతు ఆత్మహత్య

వెల్గటూర్(ధర్మపురి): అప్పు తీర్చే దారిలేదనే బెంగతో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని పైడిపెల్లి గ్రామానికి గంగధరి భూమయ్య–ప్రమీల దంపతులకు మల్లేశంతోపాటు మరో కూతురు సంతానం. మూడేళ్ల క్రితం కూతురు పెళ్లి చేశారు. తెలిసిన వారి వద్ద రూ.15 లక్షలు అప్పు చేశారు. కొద్ది రోజుల కిత్రం భూమయ్య మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి మల్లేశం తన వ్యవసాయ పొలంలో పంట పండిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆశించిన ఆదాయం రాకపోవడం, చెల్లి వివాహానికి చేసిన అప్పు తీర్చే దారిలేకపోవడం, అప్పు భారంగా మారడంతో మల్లేశం తీవ్రమనస్థాపం చెందాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.



పుస్తకాలు ఇచ్చేసారోచ్..

సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్‌తో పాటు ఈసారి రాష్ట్ర ప్రభుత్వం నోట్ బుక్స్ కూడా పంపిణీ చేశారు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వంకాయల శ్రీకాంత్, సాక్షి ఫొటో గ్రాఫర్, సిరిసిల్ల

మత్తడి పోచమ్మకు బోనాలు



వేములవాడ: వేములవాడలోని మున్నూరుకాపు కులస్తులు శుక్రవారం నిర్వహించిన మత్తడి పోచమ్మ బోనాలకు మహానేతలు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, రాజన్న ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, ఆద్యగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్‌గోలి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు, ఆయాపార్టీల నేతలు దర్శించుకున్నారు.

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సిరిసిల్ల: జిల్లాలోని వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాలయాలకు కేటాయించిన సీట్ల సామర్థ్యం మేరకు విద్యార్థులతో భర్తీ చేయాలన్నారు. వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందని, దాన్ని పెంచి ఎక్కువ మంది పిల్లలు హాస్టళ్లలో చేరేలా చొరవ చూపాలన్నారు. డీఈవో రమేశ్‌కుమార్, బీసీ అభివృద్ధి అధికారి ఎస్.రాఘవేందర్, మైనార్టీ కార్యాలయం ఓఎస్డీ సర్వర్‌మియా, ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్, రజనీ పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. అత్యధికంగా చందుర్తిలో 14.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రుద్రంగిలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వేములవాడ రూరల్‌లో 11.0, బోయినపల్లిలో 9.4, వేములవాడలో 5.5, సిరిసిల్లలో 5.4, కోనరావుపేటలో 3.9, వీర్నపల్లిలో 1.0, ఎల్లారెడ్డిపేటలో 3.8, గంభీరావుపేటలో 1.5, ముస్తాబాద్‌లో 3.9, తంగళ్లపల్లిలో 6.1, ఇల్లంతకుంటలో 7.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సగటు వర్షం 5.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇప్పటి వరకు 174.3 మిల్లీమీటర్ల వర్షం సగటున పడాల్సి ఉండగా.. 93.3 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లాలో 46 శాతం లోటు వర్షపాతం ఉంది.

ఠాణా ఎదుట మందుబాబు హల్‌చల్

సిరిసిల్లక్రైం : మందుబాబులు ఇటీవల పోలీసులను, స్టేషన్లను టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల వేములవాడలో ట్రాఫిక్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన తీరు మరువకముందే సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట మందుబాబు గురువారం రాత్రి వీరంగం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్ ముందుకు చేరుకొని తన వద్ద ఉన్న బీరుబాటిల్‌తో తలను బాదుకున్నాడు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి అతడిని అంబులెన్స్‌లో సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించగా మద్యం మత్తులో ఉండటంతో తన వివరాలను వెల్లడించలేదని, ప్రాథమిక చికిత్స చేసి పంపించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న తోట ఆగయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తెర్లుమద్దిలో బీఆర్ఎస్ బూత్ కమిటీ ఇన్‌చార్జిల నియామకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను ఇంటింటా వివరించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతోపాటు, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, ప్యాక్స్ చైర్మన్ తన్నీరు బాపురావు, సీనియర్ నాయకులు విజయరామారావు, మల్లేశ్, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కళాకారుల సేవలు మరువలేని

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



కీసరి నర్సింగంను సన్మానిస్తున్న నాయకులు

కోనరావుపేట: సాహిత్య, నాటక రంగాల్లో సేవలందిస్తున్న కళాకారుడు కీసరి నర్సింగం సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. మండలంలోని నాగారంకు చెందిన బలగం సినిమా పెద్దమనిషి కీసరి నర్సింగంను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటక, సినిమా, సాహిత్య రంగాల్లో 20 ఏళ్లుగా నర్సింగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య, పల్లిమక్త సర్పంచ్ జిన్న అనిల్, ముదిరాజ్ సభ ప్రధాన కార్యదర్శి రాయిని ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి మధు, అనిల్, తిరుపతి పాల్గొన్నారు.

మాఫియాకు అడ్డాగా జిల్లాను మార్చారు

- కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): జిల్లాను మాఫియాలకు అడ్డాగా మార్చారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే.మహేందర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఇందిరానగర్, భరత్‌నగర్, మల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక, మట్టి, ల్యాండ్ మాఫియా నడుస్తోందని, చేనేత రంగాన్ని సైతం మాఫియాగా మార్చిన ఘనత మంత్రి కేటీఆర్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్ రూ.500కు పింఛన్ రూ.4,000 అర్హులందరికీ అందిస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు లింగాల భూపతి, శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పరశురాం, మునిగెల రాజు, అరెపల్లి బాలు, బాలసాని శ్రీనివాస్, లింగారెడ్డి, తిరుపతి, భరత్‌గౌడ్, భాను, మేశ్, నాగరాజు, దుర్గయ్య, ఎలయ్య, శ్రీను, వంశీ, లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

సీజ్‌చేసిన పాఠశాలను అడ్డదారిలో తెరిచారు

- హెచ్చరించిన విద్యాశాఖ అధికారులు



ఎంఈవోతో మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలో ఇటీవల ప్రారంభమైన నారాయణ పాఠశాలకు విద్యాశాఖ నుంచి అనుమతులు లేవని కొన్ని రోజుల క్రితం సంబంధిత అధికారులు పాఠశాల గేట్‌ను సీజ్ చేశారు. కానీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్వాహకులు పాఠశాల భవనం వెనుక వైపు ఉన్న గోడను తొలగించి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇలా అడ్డదారిలో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులకు, మీడియాకు సమాచారం అందించారు. సీజ్‌చేసిన పాఠశాలను తెరవడమేంటని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రతినిధి కంచర్ల రవిగౌడ్ ప్రశ్నించగా, నిర్వాహకులు నిర్లక్ష్య సమాధానం చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రఘుపతి అక్కడికి చేరుకొని పాఠశాల నిర్వాహకులతో మాట్లాడారు. సీజ్ చేసిన పాఠశాలలో తరగతులు నిర్వహించరాదని సూచించి, విద్యార్థులను ఇంటికి పంపించారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గురువుకు ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువు కుటుంబం పేదరికంతో ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.14వేల ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆకుల వేణు రెండు దశాబ్దాల క్రితం ప్రైవేటు బడిలో ఉపాధ్యాయునిగా పనిచేశాడు. అనంతరం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లా డు. వేణు తల్లి విజయమ్మ అనారోగ్యం బారినపడడంతో తల్లిని బతికించుకుందామని స్వగ్రామం ఎల్లారెడ్డిపేటకు చేరుకొని తల్లి బాగోగులు చూసుకుంటున్నాడు. 2001వ సంవత్సరం పూర్వ విద్యార్థులు వేణురెడ్డి, శ్రీధర్, మందాటి రామచంద్రం, తిరుప తి, వెంకటేశ్, జితేందర్, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, నవీన్, అజయ్, ఆశీర్వాదం, పరశురాములు, అంజయ్య, బాలయ్య డబ్బులు పోగుచేసి శుక్రవారం అందజేశారు.